## క్లుప్తంగా

### పెద్ద చెరువు నీటిని విడుదల చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ముస్తాబాద్‌: మండలంలోని పోతుగల్, గన్నెవారిపల్లె గ్రామాలకు ముస్తాబాద్ పెద్ద చెరువు ద్వారా నీరందించాలని రైతులు తహసీల్దార్‌కు గురువారం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ముస్తాబాద్ పెద్ద చెరువు నుంచి వచ్చే ఎల్లమ్మ వాగుపై ఆధారపడి వెయ్యి ఎకరాల్లో వరిపంట వేశామని తెలిపారు. వాగులో నీటి ప్రవాహం లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయన్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు కెనాల్ ద్వారా ప్రస్తుతం పెద్ద చెరువులోకి నీరు వస్తుందని, దానిని ఎల్లమ్మ వాగులోకి విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మల్లేశం, రఘు, హనుమంతు, బాల్‌నర్సయ్య, శ్రీనివాస్, ఎల్లయ్య, లక్ష్మయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

### మండలానికి రూ.46.65 లక్షలు

చందుర్తి: కరీంనగర్ ఎంపీ బండిసంజయ్ నిధుల నుంచి మండలకేంద్రానికి రూ.46.65 లక్షలు మంజూరైనట్లు బీజేపీ మండల అధ్యక్షుడు పోంచెట్టి రాకేశ్, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రూ.35.65 లక్షలతో మండలకేంద్రంలో సైడ్ డ్రైనేజీలతో పాటు సీసీరోడ్లు, రూ.5లక్షల చొప్పున ఎస్సీ కమ్యూనిటీ భవనాలు, హైమాస్ట్ లైట్లకు రూ.లక్ష మంజూరయ్యాయన్నారు. సమావేశంలో నాయకులు సిర్రం తిరుపతి, కార్యకర్తలు ఉన్నారు.

### అయోధ్య రాముని చిత్రపటాల పంపిణీ



రాముని చిత్రపటాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కోనరావుపేట: మండలంలోని మల్కపేటలో అయోధ్య రాముని చిత్రపటాలను బీజేపీ నాయకులు గురువారం పంపిణీ చేశారు. బీజేపీ జాతీయ కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పంపించిన ఈ ఫొటోలను గ్రామంలోని ఇంటింటా తిరుగుతూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల నాగరాజు, బొల్లారం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

### పుష్పగుచ్ఛం అందజేత



అజ్మత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గాంధీబాబు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టగా మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్, ముస్లిం నాయకులు గురువారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు గాంధీబాబు, ముస్లిం నాయకులు యాసిన్, హష్మీ, నజామొద్దీన్, నసీర్, జావీద్, షఫీ ఉన్నారు.

### ఉపాధి పనులు పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

బోయినపల్లి: మండలంలోని తడగొండ, అనంతపల్లి, మల్కాపూర్, కోరెం గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో జయశీల గురువారం పరిశీలించారు. ఉపాధిహామీ మస్టర్లు, కూలీల హాజరుపట్టికను తనిఖీ చేశారు. వేసవిలో కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈజీఎస్ ఏపీవో వనం సబిత, పంచాయతీ కార్యదర్శులు మల్లేశం, అనిల్ ఉన్నారు.

### గ్రామ దేవతకు అభిషేకం

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో పోచమ్మ విగ్రహానికి గురువారం అభిషేకం నిర్వహించారు. గ్రామంలో శిథిలమైన ఆలయం స్థానంలో నూతన ఆలయాన్ని నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా పలువురు దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. గురువారం అమ్మవారిని అభిషేకించి విగ్రహాన్ని కదిలించారు. మార్చి 1న నూతన ఆలయానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇస్తారి ప్రవీణ్‌కుమార్, నాయకులు వీరవేణి తిరుపతి, తాళ్లపెల్లి సతీశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# సీట్ల కోసం భక్తుల పాట్లు

- మేడారం జాతర ఎఫెక్ట్
- వేములవాడ బస్టాండ్‌లో భక్తుల తాకిడి
- క్యూలైన్లలో నిల్చొని బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు
- మహాశివరాత్రి వరకు కొనసాగనున్న రద్దీ



క్యూలైన్‌లో నిల్చొని వరంగల్‌కు వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

వేములవాడఅర్బన్‌: దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ రాజన్న ఆలయానికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివస్తుంటారు. ఈ సంవత్సరం మేడారం సమ్మక్క–సారలక్క జాతర ఉండటంతో భక్తుల తాకిడి మరింత పెరిగింది. మేడారం జాతరకు ముందు భక్తులు వేములవాడ రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో భక్తులు గత డిసెంబర్ నుంచి రాజన్నను దర్శించుకునేందుకు పెద్దఎత్తున తరలివస్తున్నారు. భక్తులు ఎక్కువ రావడంతో బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువ అయింది. ప్రయాణికులు బస్సులు ఎక్కేందుకు అధికారులు క్యూలైన్‌లో ఏర్పాటు చేశారు.

**సీట్లకోసం గొడవ**

రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు బస్సుల్లో సీట్ల కోసం ఇటీవల గొడవపడి దాడిచేసుకుంటున్నారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఇటీవల వరంగల్‌కు చెందిన రెండు కుటుంబాల భక్తులు బస్సుసీట్ల కోసం దాడిచేసుకోగా పోలీసులు రావడంతో గొడవ సద్దుమణిగింది. మరోసారి హైదరాబాద్‌కు చెందిన భక్తులు బస్సు సీట్లకోసం కొంత దూరం వెళ్లిన బస్సు ఆపి దాడి చేసుకున్నారు. కాగా డ్రైవర్ బస్సు నిలిపివేసి వారిని దింపివెళ్లాడు.

**బస్టాండ్‌లో క్యూలైన్లు**

మేడారం సమ్మక్క, సారక్క జాతరకు ముందు వరంగల్‌కు చెందిన భక్తులు వేములవాడ పెద్దసంఖ్యలో వచ్చారు. ఆర్టీసీ అధికారులు భక్తుల తాకిడి, భక్తుల గొడవలను దృష్టిలో ఉంచుకొని వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌ను అనుకొని ఇనుప రెయిలింగ్ క్యూలను ఇటీవల ఏర్పాటు చేశారు. దాంతో వరంగల్ వెళ్లే ప్రయాణికులు క్యూలైన్‌లో బస్సులు ఎక్కుతున్నారు. వరంగల్‌కు నిత్యం వంద బస్సులు వెళ్తుంటాయి. ప్రస్తుతం అదనంగా 150 బస్సులను ఏర్పాటు చేశారు. రోజూ 250 బస్సులు వెళ్తున్నాయని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. మహా శివరాత్రి వరకు ఇలాగే భక్తుల తాకిడి ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు.

**భద్రత సిబ్బందిని ఏర్పాటు చేయాలి**

వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో భద్రత సిబ్బంది లేకపోవడంతో అధికారులకు ఇబ్బంది తలెత్తుతోంది. ఇటీవల నలుగురిని బస్టాండ్‌లో పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేశారు. మరో నాలుగు రోజుల తర్వాత ఆర్టీసీ నుంచి నలుగురు సెక్యూరిటీ గార్డుల ను ఏర్పాటు చేయనునున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు.

**ఇబ్బంది లేకుండా చూస్తాం**



రాజన్నను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఇనుప రెయిలింగ్ క్యూ ఏర్పాటు చేశాం. అలాగే బస్టాండ్‌లో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా పర్యవేక్షణ కోసం సిబ్బందిని నియమించాం.

– డిపో మేనేజర్ మురళీకృష్ణ, వేములవాడ

## ఘనంగా వేంకటేశ్వరస్వామి జాతర

- ఆలయంలో ప్రభుత్వ విప్ పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఆది శ్రీనివాస్

చందుర్తి: మండలంలోని మూడపల్లిలో స్వయంభూ గోదాదేవి, వేంకటేశ్వరస్వామి జాతర ఉత్సవాలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో పలువురు నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని మర్రిగడ్డ, నర్సింగాపూర్, అనంతపల్లి, తిమ్మాపూర్, చందుర్తి , మల్యాల గ్రామాల నుంచే కాకుండా భక్తులు వేములవాడ, కరీంనగర్, హైదరాబాద్ పట్టణాల నుంచి భారీసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణాన్ని వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు ఆలయ శాశ్వత చైర్మన్ జేపీరావు, ఆలయ పాలకవర్గ సభ్యులు, అన్నిఏర్పాట్లు చేశారు.

**ప్రభుత్వ విప్ పూజలు**

వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయనవెంట ఆలయ శాశ్వత చైర్మన్ జేపీరావు, మాజీ సర్పంచులు జువ్వాడి అనిల్‌రావు, చిలుక అంజిబాబు ఉన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సుమారు రెండువేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడ : మహాశివరాత్రి జాతర సందర్భంగా పట్టణంలో నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు చేపడుతున్న పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెస్ ఏఈ సిద్ధార్థ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బైపాస్ రోడ్డు, అంబేడ్కర్‌నగర్, పాతకూరగాయల మార్కెట్, మహాలక్ష్మివీధి, రెండో బైపాస్ రోడ్డు, తిప్పాపూర్ ప్రాంతాల సెస్ వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని ఓల్డ్ ఆంధ్రాబ్యాంక్, గోశాల, ఆలయం ముందు ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

## విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



చందుర్తి : మండలంలోని మల్యాల జెడ్పీ పాఠశాలలోని 40 మంది విద్యార్థులకు మండల కోఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్ స్టడీ మెటీరియల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకు రావాలని పిలుపునిచ్చారు. చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, వైస్‌ఎంపీపీ మందాల అబ్రహం, ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, సంటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

గంభీరావుపేట: మండలంలో పలు గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి ఉపాధిహామీ పథకం కింద నిధులు మంజూరయ్యాయి. మండలకేంద్రంలో దుబ్బాక పోచమ్మ దేవాలయం నుంచి బోయ సంఘంవరకు రూ.12లక్షలు, గోరింటాలలో ఆర్‌అండ్‌బీ రోడ్డునుంచి కేడీసీసీబీ గోదాం వరకు రూ. 16లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మంజూరు ఉత్తర్వులు జారీచేశారు.

# తండాకు పోవాలంటే తండ్లాటే !



ఇది వీర్నపల్లి మండలం మద్దిమల్లతండా, కాశీతండాల నుంచి రాయినిచెరువు తండాకు వెళ్లే మట్టి రోడ్డు. ఏటా వర్షాకాలంలో పెద్దవాగు పొంగినప్పుడల్లా రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్డు మరమ్మతు చేసి రవాణా సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు.

ఈ రోడ్డు భూక్యా తండా నుంచి దేవుని తండా శ్మశానవాటికకు, అక్కడి నుంచి రాశిగుట్టతండాకు వెళ్లేదారి. ఈ తండావాసులకు ఏమైనా ఆపదొస్తే కనీసం ఆటోలు కూడా వెళ్లలేని దుస్థితి. మండల కేంద్రానికి రావాలంటే ఈ రోడ్డే దిక్కు. మరమ్మతు కోసం నిధులు కేటాయించాలని ఆ తండావాసులు చేసిన విజ్ఞప్తులు బుట్టదాఖలయ్యాయి. నడవడానికి కూడా కష్టంగా ఉన్న ఈ రోడ్డును బాగు చేయాలని ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు.



**మండల సమాచారం**

| | |
|---|---|
| తండాలు : | 16 |
| తండా జీపీలు : | 9 |
| జనాభా : | 6 వేలకుపైగా.. |

- ధ్వంసమైన రోడ్లతో ఇబ్బందులు
- తండాలకు మట్టిరోడ్లే దిక్కు
- ఉన్న వాటికి మరమ్మతులు కరువు
- వర్షం వస్తే మరింత అవస్థ
- పొలాల గట్లే దిక్కు

వీర్నపల్లి(సిరిసిల్ల): అభివృద్ధిలో తండాలు వెనకబడిపోతున్నాయి. కనీస సౌకర్యాలకు నోచుకోలేకపోతున్నాయి. దారులు సరిగ్గా లేక తండావాసులు తండ్లాడుతున్నారు. కనీసం రోడ్డు సౌకర్యం లేక మండల కేంద్రానికి వచ్చేందుకు నానా కష్టాలు పడుతున్నారు. పలు తండావాసులకు పొలాల గట్లే దిక్కవుతున్నాయి. వర్షాకాలంలో జర్రున జారుతూ.. పడుతూ.. లేస్తూ వస్తున్నారు. వీర్నపల్లి మండలంలోని పలు తండాల ప్రజలు నిత్యం నిరకయాతన అనుభవిస్తున్నారు.

**మట్టిరోడ్లే దిక్కు**

వీర్నపల్లి గిరిజనులు ఎక్కువగా నివసించే మండలం. ఈ మండలంలో 16 తండాలు ఉండగా ఆరు తండాలకు ఇప్పటికీ మట్టిరోడ్లే దిక్కు. గతంలో వేసిన రోడ్లు పాడవగా.. మరమ్మతులు చేసేందుకు అధికారులు ముందుకురావడం లేదు. అటవీప్రాంతాల్లో అసౌకర్యాల మధ్య కాలం వెల్లదీస్తున్నారు. మండలంలో కాశీతండా, శంకర్‌నాయక్‌తండా, రెడ్డినాయక్‌తండా, బానోతుతండా, దేవునితండా, బీరప్పతండా, కోక్యతండాలు ఉన్నాయి.

**కాలినడకే శరణ్యం**

మహాలక్ష్మిలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రభుత్వం కల్పించింది. దీంతో తండాల నుంచి బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య పెరిగింది. మండలంలోని పలు తండాలకు బస్సులు రాకపోవడంతో కిలోమీటర్ల మేర నడవాల్సి వస్తోంది. తొమ్మిది గిరిజన గ్రామపంచాయతీలు ఉండగా అన్ని గ్రామాలకు బస్సులు వెళ్లే అవకాశం ఉంది. అయినప్పటికీ ఆయా రూట్లలో బస్సు సర్వీసులు లేవు. కామారెడ్డి జిల్లా సోమార్‌పేట, నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలానికి బస్సులు నడిపించాలని స్థానికుల నుంచి డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. జిల్లాలోని కోనరావుపేటకు బస్సును నడపాలని కోరుతున్నారు.

**పలుసార్లు విన్నవించాం**



మా తండానుంచి వీర్నపల్లికి వెళ్లాలంటే ఏటా వర్షాకాలంలో వాగులు పొంగి రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతీ వాగు పై వంతెనలు నిర్మించాలి. ఈ విషయమై అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

– కొడావత్ శంకర్, మద్దిమల్ల

**వంతెన నిర్మించాలి**



వన్‌పల్లి నుంచి కేలోత్‌తండాకు వెళ్లే దారిలో వట్టి వాగుపై బ్రిడ్జి లేక ఏటా వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. వాగుపై బ్రిడ్జి నిర్మించాలని అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు.

– తిరుపతి, కేలోత్‌తండా, వన్‌పల్లి

**ప్రతీ తండాకు రోడ్డు సౌకర్యం**



వీర్నపల్లి మండలంలోని ప్రతీ తండా గ్రామపంచాయతీకి రోడ్డు సౌకర్యం ఉంది. కానీ కొన్ని చిన్న తండాలకు రోడ్డు సౌకర్యం సరిగా లేదు. రెవెన్యూ భూమి లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం.

– నరేశ్‌కుమార్, వీర్నపల్లి ఎంపీవో

## లక్ష్య సాధనకు శ్రమించాలి



ముస్తాబాద్‌: నృత్యం చేస్తున్న విద్యార్థినులు



వీర్నపల్లి: ఆదర్శ పాఠశాలలో..

ముస్తాబాద్‌: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ఫేర్‌వెల్ డే వేడుకలను గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. సీనియర్ ఇంటర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు వీడ్కోలు పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానచారి మాట్లాడుతూ విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అధ్యాపకులు రాజేశ్వర్, రాజు, మురళీ, ప్రవీణ్, రాజు పాల్గొన్నారు.

**అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు**

వీర్నపల్లి : మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రిన్సిపాల్ విశ్వనాథం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రాంగణంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. 40 మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరుకాగా పలు ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 15 మందికి ఉద్యోగాలు కల్పించారు. జాబ్‌మేళాలను గ్రామణ ప్రాంత నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. విజయలక్ష్మీ కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, ఆంజనేయులు, వాణి, ధర్మపురి, శ్రీనివాస్, భిక్షమయ్య, మనోహర్, ఆది విష్ణు, కృష్ణప్రసాద్, విజయ్, మహేశ్, రాజేశ్, శైలజ, ఉమారాణి, రజిత, శ్రావణి, శిరీష పాల్గొన్నారు.

## మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు



మరుగుదొడ్ల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఈ వనజ

ముస్తాబాద్‌: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఏఈ వనజ తెలిపారు. ఈ మేరకు కళాశాలలో నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని గురువారం పరిశీలించారు. రూ.9లక్షల వ్యయంతో చేపట్టనున్న బాలికల, బాలుర మరుగుదొడ్లను వేర్వేరుగా నిర్మిస్తామన్నారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రిన్సిపాల్ జ్ఞానచారి, అధ్యాపకులు ఉన్నారు.

## విద్యార్థులు పరీక్షల్లో భయం వీడాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రవీణ్

వేములవాడరూరల్‌: వేములవాడ మండలంలోని నూకలమర్రి జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు సైకలాజిస్ట్ డా.ప్రవీణ్ పరీక్షలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. విద్యార్థులు భయంవీడి పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రతివిద్యార్థి లక్ష్య సాధనకు కృషిచేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు సదానందం, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అశోక్, గణేశ్, భిక్యూనాయక్, యుగంధర్, అజయ్, నీరజ, పుష్పలత పాల్గొన్నారు.

### కారు దిగి కాంగ్రెస్‌లోకి ఎంపీపీ ?

బోయినపల్లి(చొప్పదండి): బీఆర్‌ఎస్ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్‌పై ప్రకటించిన అవిశ్వాసం వీగిపోయింది. కానీ బీఆర్‌ఎస్‌ను వీడి ఎంపీపీ వేణుగోపాల్ కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. నేడో, రేపో మరో ఎంపీటీసీతో కలిసి కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం ఎంపీపీ చేరికపై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో పాటు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సైతం సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎంపీపీ కాంగ్రెస్‌లో చేరితే మండలంలో రాజకీయ సమీకరణలు మారే అవకాశం ఉందని భావిస్తున్నారు. బోయినపల్లి ఎంపీటీసీ సంబ బుచ్చమ్మతో పాటు, కాంగ్రెస్ ఎంపీటీసీలు ఉయ్యాల శ్రీనివాస్, బాలగోని గౌతమి, అక్కెనపెల్లి ఉపేందర్, కొంకటి శిరీషల మద్దతుతో ఎంపీపీ వేణుగోపాల్ అవిశ్వాసం నుంచి బయటపడ్డారు. మొదట అవిశ్వాసంపై వినతిపత్రం ఇచ్చిన ఆరుగురు ఎంపీటీసీల్లో కాంగ్రెస్‌కు చెందిన తడగొండ ఎంపీటీసీ శ్రీనివాస్ ఉన్నాడు. వైస్ ఎంపీపీపై అవిశ్వాసం గురించి వినతి ఇస్తామని చెప్పి, ఒక్క ఎంపీపీపైనే అవిశ్వాసం వినతిపత్రం ఇచ్చారని శ్రీనివాస్ పేర్కొన్నట్లు తెలిసింది.

## సంక్షిప్త వార్తలు

**• నూతన కార్యవర్గం**

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి గ్రామ ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడిగా బెదిరె కుమార్ ఎన్నికయ్యారు. గురువారం సమావేశమైన సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా తీపిరెడ్డి వేణురెడ్డి, కోశాధికారిగా అన్నాడి శ్రీనివాస్ రెడ్డి, సలహాదారులుగా జవ్వాజి శ్రీనివాస్, తీపిరెడ్డి మహేందర్ రెడ్డి, కార్యదర్శిగా జవ్వాజి రమేశ్, సంయుక్త కార్యదర్శిగా మనోజ్, గౌరవాధ్యక్షులుగా బూర్గుల రాజిరెడ్డి ఎన్నికయ్యారు.

**• యువత క్రీడల్లోనూ రాణించాలి**

తంగళ్లపల్లి: యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కాంగ్రెస్ నాయకుడు మిరాల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గోపాల్‌రావుపల్లె గ్రామ యువతకు క్రికెట్ బ్యాట్లు పంపిణీ చేశారు.

**• క్రీడాకారుడికి అభినందన**

సిరిసిల్ల ఎడ్యుకేషన్‌: గుజరాత్‌లో ఈనెల 15నుంచి 17 వరకు నిర్వహించిన 19వ జూనియర్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న మనోజ్‌ను ఇంగ్లిష్ యూనియన్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ అభినందించారు. అనంతరం ప్రశంసాపత్రం అందించారు.

**• ఆర్థికసాయం అందజేత**

గంభీరావుపేట: మండలంలోని ముస్తఫానగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న గాధం రాజయ్య గురువారం మృతిచెందాడు. బాధిత కుటుంబానికి గ్రామ పంచాయతీ తరపున నాయకులు రూ.10వేలు ఆర్థికసాయంగా అందజేశారు. పంచాయతీ కార్యదర్శి రాజు, ఉపసర్పంచ్ నర్సయ్య, మండల వార్డు సభ్యుల ఫోరం మాజీ కన్వీనర్ రమేశ్ పాల్గొన్నారు.

**• వాటర్‌ప్లాంట్ ప్రారంభం**

కోనరావుపేట: సుద్దాలలో ఉమెన్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. గ్రామంలోని ఉన్నత పాఠశాలలో వుమెన్ డెవలప్‌మెంట్ వేల్ఫేర్ సొసైటీ(యూకే) ఆధ్వర్యంలో హెల్త్ శానిటేషన్ బేసిక్ హైజిన్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ జనరల్ సెక్రెటరీ జమునారాణి, ఎంపీటీసీ మమత ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయురాలు మంజులాదేవి, ఎస్‌ఎంసీ చైర్మన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

**• చర్యలు తీసుకోవాలి**

సిరిసిల్లటౌన్‌: పంజాబ్ రైతులపై పోలీసు కాల్పులు అమానుషమని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. సిరిసిల్లలోని కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హర్యానా, పంజాబ్ రాష్ట్రాల సరిహద్దుల్లో హర్యానాకు చెందిన పోలీసులు కర్షకులపై దాడి చేసి చంపారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వారిని అరెస్టుచేసి చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**• విద్యార్థులకు అల్పాహారం**

ఎల్లారెడ్డిపేట: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ అధ్యక్షుడు గోనె నాగరాజు అన్నారు. బండలింగంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అల్పాహారం అందజేశారు.

**క్యాలెండర్ ఆవిష్కరణ**

ముస్తాబాద్‌: సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగ జేఏసీ క్యాలెండర్, డైరీలను మండల వనరుల కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ రాజిరెడ్డి, హెచ్‌ఎంలు రాధాకిషన్ రావు, రాజేశ్వరి, ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుమ్మ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.